యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదు

విశాలాంధ్ర - చాగల్లు : యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని చాగల్లు ఎస్సై సి.హెచ్.వి.రమేష్ అన్నారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మత్తు పదార్థాల విని యోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు బానిసై మత్తు పదార్థాలు సేవించడంతో ఎన్నో అనర్థాలు వస్తాయని అవగాహన కల్పించారు. ఈ విషయమై అన్నీ గ్రామాల్లోని యువతీ యువకులకు అవగాహన కల్పించి చెడు వ్యసనాల భారీ నుంచి సన్మార్గంలో పయనించేలా కృషి చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. ప్రధానంగా హాని కలిగించే మత్తు పదార్థాలు నాటు సారా, గుట్కా,గంజాయి, ఖైనీ మొదలగు పదార్థాలకు యువత బానిస కావద్దని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు,ఆయా సచివాలయాల మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : నగర పంచాయతీ నందు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రాజమహేంద్రవరం ఎంవివి టీవీ సత్యనారాయణరావు ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా శానిటేషన్ పై అవగాహన, చైతన్య నగర్‌లో శానిటేషన్, సచివాలయాల ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వార్డు కార్యదర్శులకు, వాలంటీర్లకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కమిషనర్ కే కొండలరావు, ఆర్ఐ రవి, సిబ్బంది ఉన్నారు.

అక్రమ మద్యం, నాటు సారా అమ్మకం దారులపై ఎస్ఈబి దాడులు

- సారా నిందితుడి పరారీ
- అక్రమ యానాం మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలం అక్రమ మద్యం, నాటు సారా అమ్మకం దారులపై పోలీస్‌లు ఉక్కుపాదం మోపారు. సోమవారం జరిపిన వరుస దాడుల్లో పలువురిని అరెస్ట్ చేసి అక్రమ మద్యం, నాటు సారా తయారీ దారులపై దాడులు చేసి, కేసులు నమోదు చేశారు. అమలా పురం డివిజన్ స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరో నేతృత్వంలో ఈ దాడులు నిర్వహించారు. కపిలేశ్వరపురం మండల పరిధిలోని కోరుమిల్లి గ్రామంలో నాటు సారా అమ్ముతున్నారని స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరోకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోరుమిల్లి గ్రామానికి చెందిన నిందితుడు పరారీలో ఉన్నాడని అమలాపురం డివిజన్ స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ వీరబాబు తెలిపారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి వద్ద మోటర్ సైకిల్‌లో అక్రమంగా తరలిస్తున్న యానాం మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం డివిజన్ స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ వీరబాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు ఎస్ఈబీకి వచ్చిన సమాచారంతో సిబ్బందితో ఆదివారం వేకువజామున తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోరుమిల్లి గ్రామంలో హీరో హెూండా ప్యాషన్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను మీద 128 నిప్స్, యానాం మందు పట్టుకుని వెళ్తున్న,కడలి పద్మరావు ను అరెస్టు చేశారు. మరొక హెూండా యాక్టివా 6జి స్కూటర్‌లో 87 బీర్లు,యానాం మద్యం రవాణా చేస్తున్న, కర్రి వీర వెంకట సుబ్బారెడ్డి అరెస్టు చేశారు. ఇతను వద్ద నుండి మోటర్ సైకిల్‌ను, 87 బీర్లు, ఒక్కొక్కటి 750 మి.లీ కెపాసిటీ గల 8 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. తదుపరి చర్యలు నిమిత్తం కేసును ఆలమూరు ఎస్‌హెచ్‌ఓకి అప్పగించామని అమలాపురం డివిజన్ స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ వీరబాబు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండలడిప్యూటీ తహశీల్దార్ ఝాన్సీ మాతృమూర్తి గెద్దాడి సావిత్రి (65) ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె ఆర్ఎంపీ వైద్యురాలిగా ఉచితంగా సేవలు అందిస్తున్నారు. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. తహశీల్దార్ మృత్యుంజయరావు, నడవపల్లి సర్పంచ్ దొమ్మేటి పల్లవి వెంకట రావు, ఎంపిటిసి అక్కల శ్రీధర్, డాక్టర్ కనకాల భైరవ స్వామి, పాకలపాటి సత్యమాంబిక వర్మ, గ్రంధి నారాయణమూర్తి తదితరులు సావిత్రి మృత దేహాన్ని సందర్శించి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్‌సిఎం చర్చిలో వజ్రోత్సవ వేడుక

విశాలాంధ్ర - తాళ్లపూడి : అన్నదేవరపేట లో ఆర్.సి.ఎం చర్చి లో ఘనంగా వజ్రోత్సవ వేడుక నిర్వహించారు. పురాతనమైన చర్చిని 13 లక్షల రూపాయల భక్తుల విరాళాలతో ఆధునీకరణ చేసి పునః ప్రారంభించారు. ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు విచ్చేసి దివ్యబలిపూజలు నిర్వహించారు. అన్నదేవరపేట వచ్చిన బిషప్‌కు ఈ ప్రాంత చుట్టు పక్కల మండలాల్లోని ఫాదర్‌లతో పాటు అన్నదేవరపేట విచారకర్త డి.ఏలీషా, సంఘ పెద్దలు ఘన స్వాగతం పలుకుతూ ఆర్‌సీఎం దేవాలయ ప్రాంగణానికి తీసుకు వచ్చారు. ఎంతో ఘనం గా జరిగిన ఈ కార్యక్రమంలో రెవ. ఫా.బి.వి.ప్రసాద్, రెవ. ఫా.కె కళ్యాణ్ కుమార్, రెవ. ఫా.అమృతరాజ్, రెవ. ఫా.బర్త్ లొమీయా, రెవ. ఫా. మోజెస్ . సంఘస్థులు ప్రభాకర్ రాజు, తాడేపల్లి రాజు, గోళ్ళ బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

విశాలాంధ్ర - తాళ్లపూడి :తాళ్లపూడి మండలం అన్నదేవరపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ఎన్టీఆర్ మనవడు, సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు నందమూరి తారక రత్న మృతి అత్యంత బాధాకరం అని అన్నదేవరపేట విక్రమాదిత్య యువజన పేర్కొంది. అన్నదేవరపేట టీడీపీ పార్టీ కార్యాలయంలో తారకరత్న ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటు, నందమూరి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, కూచిపూడి నరేంద్ర, కూచిపూడి జగన్, బోబ్బా మధు, వీరమళ్ళ బంగార్రాజు , పోలోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌ను కలిసిన బీసీ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఇటీవలే ఏలేశ్వరం ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన జివివి సత్యనారాయణను ఏలేశ్వరం బీసీ కమిటీ సభ్యులు సోమవారం మర్యాద పూర్వ కంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి భీమన సూరిబాబు మాట్లాడుతూ తామంతా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో సానుకూలంగా స్పందించాలని మేనేజర్‌ను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కెఆర్ బాబు, డిటి మూర్తులు, కేటీ మూర్తులు, ఎస్ఆర్ బాబు, ఆఫీస్ స్టాఫ్ జీవీ రామారావు, ఎస్ఎస్ నారాయణ, కే ప్రవీజ్, సురేష్, జిఎస్ నారాయణ, జెఎన్ రాజు, అప్పలరాజు తదితరులున్నారు.

సాల్ట్ భూములు పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజానపల్లి గ్రామంలో ఉన్న 42 ఎకరాల సాల్ట్ భూములను సోమవారం కాకినాడ ఆర్డీవో పరిశీలించినట్టు తహసీల్దారు పొన్నమండ శ్రీనివాస్ తెలిపారు. ఈ భూములు సాల్ట్ డిపార్ట్మెంట్ వారు ఆధ్వర్యంలో ఉండగా వీటిని కొందరు తెలియకుండా చెరువులు తవ్వుకుని అన్యాక్రాంతం చేస్తున్నారని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్డీవో రమణ, సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ మాచర్రావు ఆధ్వర్యంలో పరిశీలించి హద్దులు నిర్ణయించినట్టు తెలిపారు.

పోలవరం పరిశీలన యాత్రకు ఘన స్వాగతం

ఆకట్టుకున్న బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పరిశీలించడానికి, నిర్వాసితుల సమస్యలను అధ్యయనం చేయడానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలవరం పరిశీలన యాత్ర సోమవారం ఉదయం రాజమండ్రి నుండి బయలుదేరింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా రాష్ట్ర నాయకుల ప్రముఖ సంఘ సేవకులు రెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు. జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు నాయకత్వంలో వందలాది మందితో బైక్ ర్యాలీ రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై నుండి తాళ్ళపూడి మీదుగా సాగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తాటి పాటక మధు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పోలవరానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

లేగదూడల పోషణ, సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - పెదపూడి : లేగదూడల పోషణ, సంరక్షణపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని కాకినాడ పశుసంవర్ధశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వెంకటేశ్వరరావు అన్నారు. దోమాడ గ్రామంలో సోమవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం మండల పశువైద్యాధికారి చింతా కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్. వెంకటేశ్వర రావు, పశుగణాభివృద్ధి శాఖ ఈఓ డాక్టర్ అంబేద్కర్, సామర్లకోట ఏవీహెచ్ సహాయ సంచాలకులు డాక్టర్ కె.తాతయ్య, వీఏఎస్ డాక్టర్ ఎం. భవానీ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో 40 మంది పాడిరైతులు లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో లేగదూడల వయస్సుకు తగిన బరువు, మేలైన గుణాలు పరిశీలించారు. జి. వినోద్, మినపల్లి సాయిబాబు అనే ఇద్దరు రైతుల లేగదూడల ప్రదర్శన ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపిక చేశారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మీనపల్లి శారదాదేవి, స్థానిక గ్రామ పశుసంవర్ధక సహాయకుడు జల్లు ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఎబెట్ మందు పిచికారి

విశాలాంధ్ర - కరప : దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎబెట్ మందును పిచికారి చేయిస్తున్నట్టు మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కరప, వాకాడ, జెడ్డావరం, కొరుపల్లె, తదితర గ్రామాలలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో డ్రైనేజీల్లో స్ప్రే చేశారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైరల్ ఫీవర్ ఉన్నవి లేనిది తెలుసుకున్నారు. దోమల వలన మలేరియా, ఈగల వలన టైఫాయిడ్, కలరా, వంటి వ్యాధులు వ్యాప్తి చెందడంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పంచాయతీ విస్తరణ అధికార శ్రీనివాసరావు తెలిపారు. వీటిని అరికట్టేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల ఎంపీపీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - సీతానగరం : ప్రభుత్వ పాఠశాలను ఎంపీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో మేజర్ పంచాయతీ అయిన రఘుదేవపురం గ్రామంలో సచివాలయం సమీపంలో గల మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పరిశుభ్రత, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం మెను అందిస్తున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనుల ద్వారా నిర్మించిన భవనాలు చూసి పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థులకు కల్పించాలని ప్రధానోపాధ్యాయుడినికోరారు. విద్యార్థుల క్లాస్ రూంలను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇదేనా గ్రామాలో స్వచ్ఛ భారత్?

విశాలాంధ్ర - సీతానగరం : ఇదేనా గ్రామాలో స్వచ్ఛ భారత్? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో నూతనంగా ఏర్పడిన చీపురుపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ రహదారి మీదుగా ప్రయాణించే వారికి దుర్వాసన వెదజల్లు తోంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాలు దేశానికి పట్టు కొమ్మలు అని, గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కచ్చితంగా అమలు చేయాలని అనేక పథకాలను ప్రవేశపెట్టిన సంగతి అందరికీ తెలిసిందే. ఇటువంటి అంశాలు కాగితాలకే పరిమితం అయ్యాయి అనడంలో అతిశయోక్తి లేదు. అపరిశుభ్ర వాతావరణం వల్ల గ్రామంలో అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. అధికారులు సత్వరం స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లల్లో పరోపకారాన్ని పెంపొందించాలి

విశాలాంధ్ర - రాజోలు : ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయిలోనే ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండంట్ పివివి వర ప్రసాద్ విద్యార్థులకు తెలిపారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులు తాము దాచుకున్న కిడ్డీ బ్యాంక్ మొత్తంలో నుండి కొంత డబ్బుతో సోమవారం విశ్వేశ్వరాయపురంలోని మేరీ మాత అనాధ వృద్ధుల ఆశ్రమంలో సుమారు 30మందికి మధ్యాహ్నం రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. వారే స్వయంగా ముసలి వారికి వడ్డిస్తూ మానవత్వం చాటారు. భోజనాల అనంతరం వారికి పళ్ళు అందజేశారు. గత కొంతకాలంగా తమ పాఠశాల నుండి ప్రతీ నెలా ఒక తరగతి వారు ఇలా వృద్ధులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారని, వారి స్ఫూర్తితో ఈరోజు 6వ తరగతి విద్యార్థులు కూడా వారు పొదుపు చేసిన సొమ్ములోని కొంత భాగాన్ని ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుకు వచ్చారని కరెస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కర్రి పద్మశ్రీకి ఎమ్మెల్సీ: పార్టీ శ్రేణుల సంబరాలు

విశాలాంధ్ర - కాకినాడ జిల్లా : కాకినాడకు చెందిన వైఎస్ఆర్‌సీపీ మహిళా నాయకురాలు కర్రి పద్మశ్రీకి ఎమ్మెల్సీ పదవి వరించింది. సోమవారం రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన 18మంది ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో గవర్నర్ కోటాలో వైఎస్ఆర్‌సీపీ తరుపున బీసీ సామాజిక వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీ పేరును స్థానిక శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి సిఫారస్ మేరకు ఆమె ఎమ్మెల్సీ పదవి దక్కించుకుంది. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో శాసన సభ్యులు చంద్రశేఖరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహనెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మశ్రీకి ఎమ్మెల్సీ ప్రకటం పట్ల కాకినాడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయానికి చేరుకొని కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

స్పందనకు 237 అర్జీలు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్పందనకు వచ్చే ప్రతి అర్జీని నాణ్యతతో, పూర్తిస్థాయిలో సంతృప్తికరంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ, డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్వీవీ సత్యనారాయణ, కెఎస్ఈ జెడ్ ఎస్డీసీ కె.మనోరమ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సరఫరా సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు తదితరా లకు సంబంధించి మొత్తం 237 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు ఇలక్కియ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద అందిన అర్జీల పరిష్కార నాణ్యతను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ పనిచేస్తోం దన్నారు. స్పందన పరిష్కార నివేదికకు అర్జీదారుని సమస్య పరిష్కారానికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా జత చేయాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు , కలెక్టరేట్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీష్‌ను దూషించారంటూ ఫిర్యాదు

విశాలాంధ్ర - కాట్రేనికోన : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సాధకులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌ను దూషించా రంటూ మాల మహానాడు కార్యదర్శి చీకురుమిల్లి రవికుమార్ పై సోమవారం కాట్రేనికోన ఎస్సై శ్రీనివాస్‌కు వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని నిండు బహిరంగ సభలో సీఎం జగన్ ను కోరిన వ్యక్తి పొన్నాడ సతీష్ అని అటువంటి వారి పై వ్యక్తి గతంగా దూషించి రెండు సామాజిక వర్గాల మధ్య చిచ్చు రేపే విధంగా వ్యవహరిస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పెట్టిన రవికుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండల ఆర్‌బికె చైర్మన్ నాతి సత్యనారాయణ, ఇసుక పట్ల శీను బాబు, కాశి హనుమంతరావు, పాలెపు ధర్మారావు, సంగాని పోతురాజు, సాపే సూర్యప్రకాశ్, వడ్డీ శ్యాం ప్రసాద్, జనపల్లి శ్రీను, పాలెపు సత్యం, బొమ్మిడి సూరిబాబు, బొజ్జ నాని, అయితాబత్తుల శ్రీనివాసు, నందిక శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు.

క్రషర్, క్వారీ యజమానులు రక్షణ చర్యలు చేపట్టాలి

మల్లంపేట గ్రామ ప్రజలు

విశాలాంధ్ర - రౌతులపూడి : గత కొంతకాలంగా క్వారీ బ్లాస్టింగ్ లోను క్రషర్ల ద్వారాను, క్వారీ లారీల ద్వారాను మండలంలోని మల్లంపేట గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామ ప్రజలందరూ పట్టుబట్టగా క్వారీ క్రషర్ల యాజమాన్యాలు దిగి వచ్చారు. క్రషర్ నుంచి విడుదలయ్యే దుమ్ము ధూళి వలన తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామ ప్రజలు వాపోయారు. లారీలు విపరీతమైన లోడ్లను వేసుకొని మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు క్వారీ మరియు క్రషర్ల మల్లంపేట గ్రామంలో రామాలయం వద్ద ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు వారి సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశంలో వ్యక్తపరిచారు. మూడు పూటల గ్రామ పరిధిలో ప్రధాన రహదారిపై వాటరింగ్ చేయాలని, స్పీడు బ్రేకర్లు వేయాలని ప్రజలు కోరారు. లారీలలో బాడీ కంటే పరిమితికి మించి లోడు వేయరాదని, గ్రామ పరిధిలో వాహనాలు నెమ్మదిగా నడపాలని, మల్లంపేట నుండి కొట్టం కత్తిపూడి రోడ్డు వరకు గుంతలు పడితే వెంటనే రోడ్డు మరమ్మత్తు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని గ్రామస్తులు తెలిపారు. పాఠశాల, దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రౌతులపూడి జెడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, సాధ్యమైనంత తొందరలో రక్షణ చర్యలు చేపడతామన్నారు. గ్రామ సర్పంచ్ పోలుపర్తి సీత, ఉప సర్పంచ్ రాయిపు రెడ్డి కన్నబాబు (సన్యాసి పాత్రుడు), పోలుపర్తి తాతాజీ, శ్రీరం రెడ్డి శ్రీను, శ్రీరాం రెడ్డి రామస్వామి, వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

బొమ్మి ఇజ్రాయెల్‌కు ఎమ్మెల్సీ పదవి : మాదిగల హర్షం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి బొమ్మి ఇజ్రాయెల్‌కు శాసన మండలి సభ్యులుగా ఎన్నుకోవడం మాదిగ జాతిలో స్వాతంత్రం వచ్చినంత ఆనందంగా ఉందని పార్టీ మాదిగ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు శ్రీను ఆధ్వర్యంలో సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వాలలో మునుపెన్నడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగలేని అద్భుతం ముఖ్య మంత్రి జగన్ మోహన్రెడ్డి నెరవేర్చారని అన్నారు. ప్రతీ కులానికి న్యాయం చేయాలనే మంచి మనస్సున్న నాయకుడు ఒక్క జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. వచ్చే 2024 ఎన్నికలలో మాదిగ ప్రజలందరూ కోనసీమ జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో తిరిగి రెండవసారి జగన్మోహన్ రెడ్డిని సీఎం అధిష్టానం కైవసం చేసుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగలు నాయకులు దార్ల సత్యనారాయణ, యార్లగడ్డ రాంబాబు, ఉందుర్తి శ్రీనివాసరావు, కన్నబాబు, దొండపాటి వినోద్, యార్లగడ్డ లక్ష్మణ్, సవరపు భీమేష్, ఉందుర్తి రమణ, కోటిబాబు, సవరపు సాయి, నూటికుర్తి నాగరాజు, లక్కి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

రిపోర్టర్ మిస్సింగ్‌పై భార్య ఫిర్యాదు : కేసు నమోదు

విశాలాంధ్ర - గోపాలపురం : హెచ్ఎంటీవీ రిపోర్టర్ నాగేంద్రబాబు మిస్సింగ్ కేసుపై భార్య విజయ రేఖ ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన ముద్దాయి సాక్షి ఛానల్ కొవ్వూరు రిపోర్టర్ సున్నం శ్రీహరి, టీవీ5 ఛానల్ రిపోర్టర్ ఉప్పునపల్లి ప్రసాద్, ఏబీఎన్ ఛానల్ రిపోర్టర్ ఉప్పునపల్లి ప్రసన్నకుమార్, ప్రైమ్9 ఛానల్ రిపోర్టర్ వల్లి రెడ్డి పృథ్వీ, 99 టీవీ న్యూస్ ఛానల్ రిపోర్టర్ బండి నాగబాబు లపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు ఫోక్సో, పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

నిర్మలా కుమారి కుటుంబానికి వైసీపీ అండ

విశాలాంధ్ర - ఆలమూరు : వైసీపీ సీనియర్ నేత కొల్లి నిర్మల కుమారి లేని లోటు పార్టీకి తీరనిదని, ఆమె కుటుంబానికి వైసీపీ అండగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్పు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆల మూరులో జరిగిన నిర్మలాకుమారి సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మల కుమారి వైసీపీకి ఎనలేని సేవలు అందించారని ఆమె సేవలను ఎప్పుడు గుర్తించుకుంటామని అన్నారు. ఈ సంద ర్భంగా ఆమె కుమారుడు, కుమార్తెలను ఓదార్చి ఐదు లక్షలు నగదును అందజేశారు. పార్టీ నుంచి ఇరువురికి చెరో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడానికి ఏర్పాటు చేయనున్నట్లు జగ్గిరెడ్డి తెలిపారు. నిర్మల కుమారి చేసిన సేవలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకునే కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోరాటి లక్ష్మణరావు, మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ప్రముఖ పరిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు, యనమదల నాగేశ్వరరావు, నాతి కుమార్ రాజా, నెక్కంటి బుజ్జి, రావాడ సత్తిబాబు, నరేష్ తదితరులు పాల్గొని ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

గాల్ బ్లాడర్ నుంచి 104 రాళ్ళు తొలగించిన వైద్యులు

విశాలాంధ్ర - అనపర్తి : కొన్నేళ్లుగా కడుపు నొప్పి తో బాధ పడుతూ ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేక నిరాశ చెందిన షేక్ షకీలా కు స్థానిక సిడిఆర్ వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి బాధ నుండి విముక్తి చేశారు.వివరాల్లోకి వెళ్తే నిడదవోలు ప్రాంతం సమిశ్ర గూడెంకి చెందిన షేక్ షకీలా కడుపు నొప్పితో బాధపడుతూ స్థానిక సిడిఆర్ ఆసుపత్రి కి రాగా స్కానింగ్ ద్వారా గాల్ బ్లాడర్ లో రాళ్ళు ఉన్నట్టు గుర్తించి సోమవారం లేప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా వైద్యులు కర్రి సునీల్ కుమార్ రెడ్డి, బాంధవి దంపతులు తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సునీల్,బాంధవి మాట్లాడుతూ ఆమె గాల్ బ్లాడర్ లో ఉన్న సుమారు 104 రాళ్ళు విజయవంతం గా తొలగించినట్లు తెలిపారు.షకీలా ఆరోగ్య పరిస్థితి కూడా బాగుందని తెలిపారు. ఎంతో కాలంగా బాధ పడుతున్న కడుపు నొప్పి నుండి బాధపడుతున్న రోగి కి శస్త్ర చికిత్స తో విముక్తి కలిగించిన వైద్యులకు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రి ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్స్ ఉపయోగించుకుని వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి కోరారు.సోమవారం కుతుకు లూరు గ్రామపంచాయతీ కార్యాల యంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలిం చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి సురేష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు సబ్బెళ్ళ రామారెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వ వైద్యులు చాందిని కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాలయేసు క్షేత్రంలో ఉత్సవాల సందడి

విశాలాంధ్ర - గోపాలపురం : మండలంలోని దొండపూడి గ్రామ శివారులో ఉన్న బాల యేసు పుణ్యక్షేత్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎలెక్స్ తెలిపారు.మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసామన్నారు.ఈ ఆలయానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని ఇక్కడ ప్రతిష్ఠించబడిన బాల యేసు విగ్రహాన్ని జెరూసలేం నుండి తీసుకురావడం జరిగిందన్నారు.మఠాధిపతి పోప్ జాన్ పాల్ ఆశీర్వాదాలతో ఈ విగ్రహాన్ని పంపిచారన్నారు.ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, చివరి రోజైన గురువారం ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమేర హాజరై తన దివ్య సందేశాన్ని ఇస్తారని ఫాదర్ తెలిపారు. జిల్లాల్లోని నలుమూలల నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు చెందిన ఫాదర్ లు,భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం జరిగిన సాముహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాల యం నుంచి డీడీఏ (రైతుభరోసా కంద్రం) డి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎలుకల మందును అందరూ ఒకేరోజు వరి పొలంలో పెట్టడం వలన ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చునని తెలియజేసారు. రైతులు అడిగిన మేరకు రైతు భరోసా కేంద్రంలో కూడా ఎలుకల మందును జెనెరల్ సేల్ రూపంలో అందుబాటులో ఉండేటట్లు చూస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం పిడి జ్యోతిర్మయి, డిఆర్‌సిఏవో మనోహర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్, వ్యవసాయ సహాయకులు జి హరిబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు దుర్గారావు, సొసైటీ ప్రెసిడెంట్ పాల్ రాజు, జెసిబి వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీనివాస్ చౌదరి, సూరంపూడి గణేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు మొండి చేయి చూపిన జగన్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఎమ్మెల్సీ పదవుల్లో విశ్వ బ్రాహ్మణులకు జగన్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎన్‌జేపీ (నేషనల్ ఈస్ట్ జనశక్తి పార్టీ) పార్టీ జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలైన విశ్వబ్రాహ్మణలకు మొండి చేయి చూపించిందని, రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు 30 లక్షల పైగా ఉన్నారని, పాదయాత్రలో భాగంగా విశ్వబ్రాహ్మణు లకు ఎమ్మెల్సీలు కేటాయిస్తామని మాట తప్పారని అన్నారు.

వేమన శతకాలు చదివిన విద్యార్థులు

విశాలాంధ్ర-తణుకు : తణుకు స్వర్ణా క్లబ్, మాతృభాష పరిరక్షణ సమితి వారు సోమవారం 108 సార్లు వేమన శతకాలను 500 మంది చిన్నా రులచే చదివించే బృహత్తర కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర బీసీ నాయకురాలు, రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళా దేవి ఆర్థిక సహాయంతో క్లబ్ సభ్యులు లయన్ బూరుగుపల్లి వెంకట్రావు,లయన్ బూరుగుపల్లి లలిత,లయన్ సుబ్బరాజు పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సుమారు 500 మంది కి వ్యక్తిత్వవికాస పుస్తకాలు, కార్యక్రమ నిర్వహణా వ్యవస్థకు 2000రూపాయలు అందజేశారు. ఈసందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ఇలాంటి సంస్థల ద్వారా నేటి విద్యార్థులకు మన భాషలోని మాధుర్యం, విజ్ఞానం పెరగ టానికి దోహదపడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో స్వర్ణాక్లబ్ నాయకులు ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల నుండి అనేక స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.5000 మంది చిన్నారు లచే వేమన శతకాలు, జాతీయ గీతాలాపన వంటి కార్యక్రమాలతో కార్యక్రమం నిర్వహించారు.

ధైర్య సాహసాలు బాల్యం నుంచే రావాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ధైర్య సాహసాలు బాల్యం నుంచే రావాలని, అటువంటి కోవలో వినూత్నంగా చేసిన సాహసం గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో సాహస బాలిక జాతీయ అవార్డు గ్రహీత వినూత్నను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభినందించి సత్కరించారు. ఒక ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించడం తక్కువని, దగ్గరకు వెళ్ళి సహాయం చేసే సంఘటనలు తక్కువేనని, అలా అరుదుగా వినూత్నంగా చేసిన సాహసం సమాజానికే ఆదర్శమని అన్నారు. తాను ప్రమాదంలో చిక్కుకుని తన ప్రాణాలతో పాటు నలుగురు ప్రాణాలు కాపాడిన వినూత్నను అభినందించారు. ఎంబీబీఎస్ లో ఉచిత సీటు సాధించడం వినూత్న చేసిన మరో సాహసంగా భావిస్తున్నానని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వినూత్న తల్లి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - కలిదిండి: ఐదు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి వార్షిక మహెూత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం కలిదిండి శివారు భోగేశ్వర లంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు వసంతోత్సవం, త్రిశూల స్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పూర్ణాహుతి కార్యక్రమాలతో ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేశారు. ఈవో శింగనపల్లి. శ్రీనివాసరావు, వంశపారంపర్య ధర్మకర్తలు అడవి. వెంకట గంగాధర శర్మ, ధర్మకర్తను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేయండి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : మండలంలోని పిన్నరెడ్డి పల్లి, నుగొండపల్లి, రాజరం గ్రామాల్లో సభ్యత్వ చేర్పింపుపై వలంటీర్లు,,గ్రామ ముఖ్య నాయకులతో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ సమావేశం నిర్వహించారు. 500 రూపాయలు పెట్టి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షలు ప్రమాద బీమా ఉంటుందని రూ. 50వేలు వరకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండలం ప్రధాన కార్యదర్శిలు యలవర్తి సువర్ణ బాబు, మల్లవల్లి శివరాంప్రసాద్, పిన్నారెడ్డిపల్లి గ్రామ నాయకులు బొడ్డు ఆనంద్ కుమార్, చోడవరపు ప్రదీప్,ఉదయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : నందమూరి తారక రత్న మృతి పార్టీకి తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు నందమూరి తారకరత్న మృతిపై సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చిన్న వయసులోనే తారకరత్న గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, బలుసు నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పూలపల్లి వెంకటరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల అరుణ, రాచూరి మదన్, గెడ శ్రీరామచంద్రమూర్తి, పెద్దిరెడ్డి, కర్రీ సత్యనారాయణ, సంకు కృష్ణా, పైడిమల రమేష్, ఊడిగా పెంటయ్య, నాయుడు లీలాకాంత్, టైలర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని నందరాడ నరేంద్రపురం గ్రామంలో ఉన్న సీలింగ్ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు,కార్యదర్శి జన్నుపల్లి సత్తిబాబు, పి.వెంకట్ నాయుడు అన్నారు. నందరాడ నరేంద్రపురం గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక కాంద్రేగుల జోగిజగన్నాథం బహుదూర్ అన్నదాన సత్రం నుండి గాంధీబొమ్మ,బస్టాండు, మీదుగా ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ ఎన్. ఎస్.పవన్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ నందరాడ,నరేంద్రపురం గ్రామాల పరిధిలోని 435/6,7,429/2ఏబి సర్వే నెంబర్లలో ఎనిమిది ఎకరాల ఇరవై నాలుగు సెంట్ల భూమిని ఆయా గ్రామాలకు చెందిన 40మంది నిరుపేద కుటుంబాలు గత 18 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఇటీవలే ఆయా భూముల్లో అవకతవకలు జరిగాయని,సదరు భూమి విషయం కోర్టులో ఉండగానే కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు జరిగాయని మండిపడ్డారు. పట్టాదారు పేర్లు అడంగుల్లో నమోదు చెయ్యాలని కోరారు. అదేవిధంగా రాజానగరంలో కాలవ గట్టుపై వేసుకున్న పాకలకు ప్రభుత్వమే విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు.దింతో తహశీల్దార్ పవన్ పై సమస్యలు పై చర్చించి,సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జి.సూరిబాబు, డివిజన్ నాయకులు ఎం.వెంకన్న, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, నక్క లక్ష్మి,చిరుకూరు నాగమ్మ, షేక్ బేబీ, కడియాల దుర్గారావు, పాలిసెట్ సన్నాసమ్మ, గుత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య సివిల్ విభాగంలో విజ్ఞానదాయకంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక రోజు ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఈవెంట్‌ను నిర్వహించినట్లు విభాగాధిపతి డా ఎన్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 40 బృందాలుగా పాల్గొన్నారు. వారు పోస్టర్లు మరియు నమూనా ద్వారా తమ వినూత్న ఆలోచనలు అద్దంపట్టే విధంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఆద్యంతం విజ్ఞానదాయకంగా సాగింది. ప్రదర్శించబడిన అన్ని ప్రాజెక్టులు వేటికవే ఉత్తమంగా ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సివిల్ విభాగాధిపతి ప్రో నాగ సాయి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల నూతన ఆవిష్కరణలలో అత్యుత్తమ టాప్ 04 ప్రాజెక్టులను ఎంపికచేయడం జరిగింది. ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులలో దాగియున్న వినూత్న ఆలోచనలను పరస్పరం పంచుకొనుటకు, వారిలో దాగి ఉన్న ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులకు చక్కటి వేదికను అందించడం అని అన్నారు. మరియు వారి సామర్థ్యాన్ని ఆవిష్కరించడం మరియు విద్యార్థులు వారి అభ్యాస అనుభవాన్ని ప్రదర్శించడానికి అవకాశం కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో .కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, హెచ్ఓడీలు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజు మృతిపై విచారణ జరపాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : వాలు తిమ్మాపురం రోడ్డులో ఉన్న పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో మరణించిన కార్మికుని మృతిపై సమగ్రవిచారణ జరపాలని సిఐటియు పెద్దాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి క్రాంతి కుమార్‌లు డిమాండ్ చేసారు. కార్మికుడు కనిపించకుండా పోయిన దగ్గర నుండి కంపెనీ యాజమాన్యం వింతవాదనలు చెబుతుందని ఆరోపించారు. కార్మికునికి కనీసం కంపెనీ నుండి పిఎఫ్, ఇఎస్ఐ కట్టలేదని దీనితో కుటుంబం మొత్తం దిక్కుతోచని స్థితిలో నెట్టబడిందని అన్నారు. వర్క్ మెన్ కాంపన్ సేషన్ యాక్ట్‌లో ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేసారు. నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. జి రాగంపేటలో వర్కర్ల మృతి చెందిన ఘటన మరువక ముందే పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లో వర్కర్ మరణించారని అన్నారు. పనిలో దుమ్ముధూళితో కనీస భద్రత ప్రమాణాలు లేక మరణించారని, దీనికి యాజమాన్యమే పూర్తి భాద్యత వహించాలని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ కట్టకపోతే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపైన ఉన్నతాధికారులకు సిఐటియుగా నివేదిస్తామని ప్రకటనలో తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ, వర్క్ మెన్ కాంపన్ షేషన్ యాక్ట్ ప్రకారం ఎంత వస్తుందో ఆ మొత్తం కంపెనీ కార్మికుడు గౌరిశెట్టి రాజు కుటుంబానికి అందించాలని డిమాండ్ చేసారు. కంపెనీ యాజామాన్యంపై కేసునమోదు చేయాలని డిమాండ్ చేసారు.

కల్యాణ మహెూత్సవం

విశాలాంధ్ర-టి.నరసాపురం : శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ప్రాంగణంలో 27వ కళ్యాణ మహెూత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా చిన కాశీగా పేరొందిన స్థానిక శివాలయంలో వేలాది మంది భక్తుల సహకారంతో ఐదు రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఆఖరి రోజు అఖండ అన్న దాన వితరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి,పసుమర్తి రాము,దేవరపల్లి సీతా రామ ప్రసాద్,కన్నం సర్వేశ్వర రావు,వెజ్జు బాలరాజు, నల్లూరి శ్రీను,లింగారెడ్డి శ్రీను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు/శంఖవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన ఉరుకుట్టి శివ దుర్గ తండ్రి ఉరుకుట్టి రాంబాబు ఇటీవల అకారణంగా మరణించారు. ఈ సందర్భంగా సోమవారం ఉరుకుట్టి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రత్తిపాడు నియోజకవర్గం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గొంప శివకుమార్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. కిర్లంపూడి మండలం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నైదాన రఘు, బర్ల లోవరాజు, సారీపల్లి రమేష్, మచ్చర్ల శ్రీనివాస్, కోన గంగాధర్ తదితరులు పరామర్శించారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు 13 నెలల బకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలు కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలంటూ జిల్లా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నిమ్మకాయల వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 2021 సంవత్సరంలో 7 నెలలు బకాయి జీతాలు ఉన్నాయని 2022లో సంవత్సరంలో 6 నెలల బకాయి జీతాలు ఇవ్వవలసి ఉందని అన్నారు. ఇన్నేసి నెలలు జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఏంతిని పనిచేస్తారని డిఎల్‌పిఓని నిలదీశారు. డిఎల్‌పీఓ మాట్లాడుతూ 2021లో ఏడు నెలలు ఇవ్వాల్సింది వాస్తవమేనని దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేయవలసి ఉందని చెప్పారు. 2022 సంబంధించి వెంటనే బకాయి జీతాలు చెల్లిస్తామని ముందుగా రెండు నెలకు జీతాలు ఇస్తామని డిఎల్‌పిఓ టీ కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి తక్షణమే జీతాలు ఇవ్వాలని ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగడం నాగేశ్వరరావు, పందు నాగభూషణం, వడ్డీ సాక్షి, పాచ్చిమాల శ్రీరాములు, జగడం సత్యనారాయణ, రాజేష్, తదితరులు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.

శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

విశాలాంధ్ర - ఐ పోలవరం/మురమళ్ళ : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కి భక్తురాలు విరాళం సోమవారం అందించారు. తాపేశ్వరం వాస్తవ్యులు సలాది, సాయి సత్య నవీన్ రూ.14000 (పద్నాలుగు వేలు) రూపాయలు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణలకి అందించారు. తొలుత దాతను ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేసి సత్కరించారు. నిత్యం స్వామి వారి ఆలయంలో రాత్రి కల్యాణానికి విచ్చేసే భక్తులకు శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదాన పథకాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది.

సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

విశాలాంధ్ర - ఆలమూరు : రబీ వరి సాగులో ఎలుకల బెడద నుంచి రక్షించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు మండల వ్యవసాయ అధికారిని ఎస్ లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో రైతులకు ఎలుకలు నివారణ మందును పంపిణీ చేశారు. మండలంలో ఒకేరోజు అన్ని గ్రామాలలో రైతులకు ఒకేసారి ఎలుకల నివారణకు తయారు చేసిన ఎర్రను అందించడం జరుగుతుందని ఏవో లక్ష్మీ లావణ్య తెలిపారు. మండలంలో 9750 ఎకరాలలో రబీ సాగు జరుగుతుందని రైతులందరికీ ఈ మందును ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పృథ్వి పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-ఎ.కొండూరు : రాజకీయ పార్టీలకు, కుల మతాలకతీతంగా అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఎ. కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన పట్ల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరవేస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్యాగనియా, వైస్ ఎంపీపీలు, గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, సర్పంచ్ వెంపాటి రజిని, తహసీల్దార్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి వి ఎస్ నాగేశ్వరరావు, ఎంఈఓ ఎం.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుసమస్యలపై ఉద్యమించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్

విశాలాంధ్ర-చల్లపల్లి : రైతు సంఘాలను బలోపేతం చేసి రైతు సమస్యలపై ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గం సమావేశం సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆజాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి రైతు సంఘాలను బలోపేతం చేసి రైతు సమస్యలపై పోరాడాలన్నారు. ఆర్‌బికే ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతుందని విమర్శించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత నెలలో రైతులు తోలిన ధాన్యానికి ఇప్పటివరకు నగదు జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. కూలీలకు రైతులు గట్టుమీదే నగదు చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో రైతుల బాధ వర్ణన జీవితంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరి మాసూరు చేసిన రైతులు ఆర్ బి కే సెంటర్లోకి వెళితే అక్కడ సైట్ ఓపెన్ అవ్వటం లేదని, అధికారులు జిల్లా టార్గెట్ పూర్తయింది అని చెబుతున్నారని రైతులు వాపోతున్నట్లు తెలిపారు. గత సంవత్సరం మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు జరగగా ఇప్పుడు జిల్లా టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరం గా మారిందని తెలిపారు.రైతు పండించిన ధాన్యాన్ని చివరికించే వరకు కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రాలు రైతులకు భరోసా కల్పించలేక పోతున్నాయని వాపోయారు. రైతు సంఘం జిల్లా మహాసభలు ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు ఆజాద్ ప్రకటించారు. ఈ మహాసభల నాటికి గ్రామస్థాయి నుండి రైతు సంఘాలు బలోపేతం కావాలని కోరారు. త్వరలోనే మహాసభ జరగబోయే తేదీని, ప్రదేశాన్ని ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులతో కలిసి చల్లపల్లి తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వేమూరి రత్నగిరి రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు కొండయ్య, పరుచూరి శ్రీనివాసరావు, మాలెంపాటి కాంచనరావు, స్థానిక నాయకులు పరుచూరి వెంకన్న బాబు, బండి రామకృష్ణ, కొర్రపాటి ముఖర్జీ, మాలెంపాటి కోటేశ్వరరావు, కొల్లూరు శ్రీధర్, కోడె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాలపై దాడి దారుణం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై వైసీపీ కార్యకర్తల దాడి చేయడాన్ని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాడిపత్రి తాతయ్య సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలు వారు ఎవరి అభిప్రాయాలు వాళ్ల ప్రచారం చేసుకుంటారు. ఈ హక్కులకి భంగం కలిగించే విధంగా ఒక పార్టీ వారు ఇంకొక పార్టీ కార్యాలయాలపై దాడిచేసి తగలబెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పదవిలో ఉన్నాం కదా అని ప్రతిపక్షాలపై ఇటువంటి దాడులు చేయడం హేయమైన చర్యగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు కలగజేసుకొని గన్నవరం ఏరియాలో శాంతిభద్రతలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విశ్వాసం కోల్పోతున్న 'స్పందన'

విశాలాంధ్ర-విజయవాడ : ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ప్రజలలో విశ్వాసం కోల్పోతుందని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి టి.తాతయ్య సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. సుదూర ప్రాంతం నుంచి ఎంతో ఆశతో జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు వచ్చిన ప్రజలు, స్పందన కార్యక్రమంలో అధికారులు లేకపోవడంతో నిరాశ నిస్పృహలకు లోను ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల అనాలోచిత చర్యలతో సోమవారం వేరువేరు కార్యక్రమంలను ఏర్పాటు చేయడంతో జిల్లా కలెక్టర్ సహా అధికారులు స్పందన కార్యక్రమంలో అర్జీదారులను కలవలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దీంతో ఎన్నో ప్రయాసలకు లోనయ్యి తమ బాధలు చెప్పుకుందామని వస్తే అధికారులు లేకపోవడం, ఒకవేళ ఉన్నా వారి ఉత్తర్వులను నాయకులు పెడచెవిని పెట్టడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ముందు ముందు స్పందన వల్ల ఎటువంటి ప్రయోజనం కనిపించకోతే ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ప్రజలలో విశ్వాసం కోల్పోతుందన్నారు. ఈ విషయంపై ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని కోరారు.

విజయవాడ డివిజన్ సరకు రవాణాలో 40 రోజుల ముందుగానే లక్ష్యాన్ని అధిగమించాయి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వే డివిజన్ వార్షిక సరుకు రవాణా 30.1 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని 40 రోజుల ముందుగానే సాధించిందని రైల్వే అధికారులు సోమవారం స్పష్టం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరం మూసివేతకు 40 రోజుల ముందుగానే 30.1 మిలియన్ టన్నుల వార్షిక సరకు రవాణా లక్ష్యాన్ని అధిగమించి ఆదాయ లక్ష్యాన్ని రూ. 3257 కోట్లతో విజయవాడ డివిజన్‌కు మరో ఘనతగా నిలిచింది.గత ఏడాదితో పోలిస్తే 59.1% పెరిగిన లోడింగ్‌ను సాధించి 11.20 మెట్రిక్ టన్నులు సంపూర్ణ ఇంక్రిమెంటల్ లోడింగ్‌లో మన డివిజన్ 2వ స్థానంలో ఉంది. తూర్పు మధ్య రైల్వేలో ధన్‌బాద్ డివిజన్ 12.44 ఎమ్‌టిలో మొదటి స్థానంలో ఉంది. భారతీయ రైల్వేల మొత్తం ఇంక్రిమెంటల్ లోడింగ్‌లో 1/8 కంటే ఎక్కువ.విజయవాడ డివిజన్ స్థూల ఆదాయం గత నెల వరకు రూ.4407.01 కోట్లు, సరుకు రవాణా ఆదాయం రూ. 3309.74 కోట్లు. డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం స్థూల ఆదాయంలో మరోసారి 5000 కోట్ల మార్కును అధిగమించనుంది. విజయవాడ డివిజన్ యొక్క అత్యుత్తమ,అత్యధిక ఆదాయాలు 2018-19 సంవత్సరంలో నమోదు చేయబడిన రూ.5136 కోట్లు.డివిజన్‌కు బొగ్గు ప్రధాన కంట్రిబ్యూటర్ వస్తువుగా ఉంది, డివిజన్ నుండి వివిధ ఇతర గమ్యస్థానాలకు రవాణా చేయబడిన సరుకులో దాదాపు 52% వాటా ఉంది. సుమారు 15.12 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేయబడింది.దాదాపు 6 ఎమ్‌టి ఎరువులు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లోడ్ చేయబడిన రెండవ అత్యధిక సరుకు. కృష్ణపట్నం పోర్ట్ , కాకినాడ పోర్ట్ సైడింగ్స్ డివిజనల్ ఆదాయాలలో వారి ప్రధాన సహకారాలతో కీలక పాత్ర పోషించాయి.ఈ సందర్భంగా డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు ఈ అరుదైన ఘనత సాధించడంలో కమర్షియల్ సిబ్బంది కృషిని కొనియాడారు. డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్ మాట్లాడుతూ రికార్డు స్థాయిలో సరుకు రవాణా లోడింగ్ కోసం వాణిజ్య,నిర్వహణ సిబ్బంది. సాంప్రదాయ వస్తువుల లోడింగ్ వాటాను పెంచడానికి మరియు కోల్పోయిన వస్తువుల ట్రాఫిక్‌ను తిరిగి పొందేందుకు భారతీయ రైల్వే వినియోగదారుల కోసం హేతుబద్ధమైన ధరలకు వివిధ సరుకు రవాణా ప్రోత్సాహక పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు ముందు వార్షిక లోడింగ్ లక్ష్య గణాంకాలను సాధించడంలో సిబ్బంది కృషిని ప్రశంసించారు.